క్లుప్తంగా

29న గంగమ్మకు పెద్దిరెడ్డి పట్టువస్త్రాలు సమర్పణ

చౌడేపల్లె: మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులు ఈనెల 29న బోయకొండ గంగమ్మకు పట్టువస్త్రాలు సమర్పించనున్నట్లు వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, జెడ్పీటీసీ దామోదరరాజు, పార్టీ మండల అధ్యక్షుడు నాగభూషణరెడ్డి, వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు.

ఈ-పంట నమోదును వేగవంతం చేయాలి


పాతురునత్తం వద్ద వరి పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయశాఖాధికారి

బైరెడ్డిపల్లె: ఈ-పంట నమోదును వేగవంతం చేయాలని జిల్లా వ్యవసాయశాఖాధికారి మురళీకృష్ణ ఆదేశించారు. ఆయన శుక్రవారం పాతురునత్తం, దేవదొడ్డి గ్రామాల్లో జరుగుతున్న ఈ-పంట నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈ-పంట నమోదు ప్రక్రియ చేస్తేనే ప్రభుత్వ పథకాలు అందుతాయని తెలిపారు. ఏవో గీతాకుమారి పాల్గొన్నారు.

ఆదాయ వనరులు సమకూర్చుకోవాలి

గుడుపల్లె: పంచాయతీలు ఆదాయ వనరులను సమకూర్చుకుని గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీవో రవిచంద్ర తెలిపారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో శుక్రవారం పంచాయతీల అభివృద్ధి, ప్రణాళికల రూపకల్పనపై సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీల్లో ఆదాయం పెంచుకునేందుకు ప్రత్యేక ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు.

తరగతుల నిర్వహణపై ఏఐఎస్ఎఫ్ నేతల నిరసన


నిరసన తెలుపుతున్న ఏఐఎస్ఎఫ్ నేతలు

పలమనేరు: పట్టణంలోని కొన్ని ప్రైవేటు పాఠశాలల్లో దసరా సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్నారని, అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఏఐఎస్ఎఫ్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారు శుక్రవారం స్థానిక ఎమ్మార్సీ వద్ద నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేటు స్కూళ్ల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా నాయకులు ప్రవీణ్‌కుమార్, సంజయ్, రిషి, అమాంశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అంతర్జాతీయ బధిరుల దినోత్సవం

చిత్తూరు కలెక్టరేట్: స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో శనివారం ఉదయం 10 గంటలకు అంతర్జాతీయ బధిరుల దినోత్సవం నిర్వహించనున్నట్లు శుక్రవారం జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ వినోద్ విలేకరులకు తెలిపారు. జిల్లాలోని బధిరులు, సంఘాల నాయకులు, ప్రభుత్వ ఉద్యోగులు హాజరుకావాలని కోరారు. బధిర ప్రభుత్వ ఉద్యోగులకు ఓడీ సౌకర్యం ఉందని, దీనిని ఆయా శాఖల ఉన్నతాధికారులకు తెలియజేసి కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

తెలివి మీరిన ఇసుకాసురులు

ఇసుకాసురులు తెలివి మీరిపోయారు. కౌండిన్య నదిలో నీరు చేరడంతో ఇసుక దొరకకపోవడంతో కొత్త ఉపాయాన్ని కనుగొన్నారు. పగలు అడవి నుంచి మట్టిని జేసీబీలతో తోడి రాత్రుళ్లు కౌండిన్య నదిలో వేస్తున్నారు. తర్వాత దాన్ని జల్లించి ఇసుకగా మారుస్తున్నారు. పగటిలు ట్రాక్టర్లలో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. కౌండిన్య నది ప్రవహించే పలమనేరు, గంగవరం, పెద్దపంజాణి మండలాల్లో కూటమి నేతలకు ఇదో మేతలా మారింది.

ఫిల్టర్ అయిన ఇసుకను ట్రాక్టర్‌కు నింపుతున్న కూలీలు


- కౌండిన్యలో మట్టి కలిపి ఇసుకను ఫిల్టర్ చేస్తున్న వైనం
- రాత్రిళ్లు నీటిలో ఫిల్టరింగ్, పగటిపూట ట్రాక్టర్లతో రవాణా
- కొత్త టెక్నిక్‌తో ఇసుక విక్రయాలు చేస్తున్న స్మగ్లర్లు
- రోజుకు 150 ట్రాక్టర్ల ఫిల్టర్ ఇసుక తరలింపు


కౌండిన్య నదిలోని నీటిలో ఇసుకను తోడుతున్న యంత్రాలు

పలమనేరు: పలమనేరు నియోజకవర్గంలోని కూటమి నేతలకు కౌండిన్య నది ఆదాయ వనరుగా మారింది. నదిలో నాణ్యమైన ఇసుక వుండడం, దానికి ఇతర ప్రాంతాల్లో మంచి డిమాండ్ వుండడం, ఉచితంగా ఇసుక తోడుకోమని సీఎం చంద్రబాబు చెప్పడంతో రాత్రి, పగలు తేడా లేకుండా ఇసుకను తవ్వేస్తున్నారు. టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా బెంగళూరు, చెన్నై తదితర ప్రాంతాలకు తరలిస్తూ రూ.లక్షలు ఆర్జిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు కౌండిన్య నదిలోకి నీరు చేరడంతోపాటు ఇసుక ఖాళీ కావడంతో కొత్త ఉపాయాన్ని గుర్తించారు. నదీ పరివాహక ప్రాంతాల్లో మట్టిని తవ్వి నదిలో వేస్తున్నారు. ముఖ్యంగా పలమనేరు మండలం క్యాటిల్ ఫామ్ సమీపంలోని వెటర్నటీ భూములు, ఆ పక్కనే ఉన్న అడవుల్లోని మట్టిని జేసీబీలతో తోడి పక్కనే ఉన్న కౌండిన్య నదిలో వేస్తున్నారు. తర్వాత ఆ మట్టిని జేసీబీతో కలియ తిప్పుతూ ఫిల్టర్ చేసి ఇసుకను తోడుతున్నారు. అలాగే గంగవరం మండలంలోని జీడిమాకులపల్లి గ్రామంలోనే 18 ట్రాక్టర్లు, రెండు జేసీబీలు రాత్రి పగలు ఇసుక తవ్వే పనిచేస్తున్నాయి.

రహస్య ప్రాంతాల్లో డంపింగ్

పట్టణంలో గిరాకీ ఉంటే అక్కడికి ఇసుక తరలిస్తున్నారు. లేదంటే రహస్య ప్రాంతంలోని డంప్ చేస్తున్నారు. అక్కడి నుంచి రాత్రికి రాత్రే టిప్పర్ ద్వారా కర్ణాటకలోని పలు ప్రాంతాలకు పంపిస్తున్నారు. ఎన్ని లోడ్లు కావాలో వ్యాపారులు చెబితే చాలు వారికి లొకేషన్ షేర్ చేస్తున్నారు. టిప్పర్ సంబంధిత ప్రాంతానికి వచ్చి లోడు వేసుకుని వెళుతున్నాయి. నగదు లావాదేవీలన్నీ ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా జరుగుతున్నాయి. ఇంత జరుగుతున్నా ఇరిగేషన్, రెవెన్యూ, మైనింగ్, పోలీసులు, పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. దీనిపై పలమనేరు తహసీల్దార్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.


కౌండిన్య నదిలో వేయడానికి తవ్విన మట్టి

రోజుకు 150 ట్రాక్టర్ల ఫిల్టర్ ఇసుక విక్రయాలు

నదిలో మట్టి వేసి ఫిల్టర్ చేసే ప్రక్రియను ఒకరిని చూసి మరొకరు గ్రామాల్లో చేయడం మొదలుపెట్టారు. దీంతో నదిలో ఎటూ చూసిన నీళ్లున్న గుంతల్లో మట్టిలోడ్లను దింపేసిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. నదికి ఆనుకుని ఉన్న గ్రామాల్లో ఎంతలేదన్నా రోజుకు 150 ట్రాక్టర్ల ఇసుక విక్రయాలకు వెళుతోందంటే ఇసుక అక్రమ రావాణా ఏ స్థాయిలో సాగుతుందో అర్థం చేసుకోవచ్చు.

రేపు ఉచిత వైద్య శిబిరం

శాంతిపురం: మండలంలోని తుమ్మిశి రోడ్డులో వున్న ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రాంగణంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు బీజేపీ మండల అధ్యక్షుడు గజేంద్ర తెలిపారు. ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా నిర్వహిస్తున్న సేవా పక్షోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. కుప్పం పీఈఎస్ ఆస్పత్రి వైద్యులు రోగులకు గుండె, వెన్నెముక, నరాలు, మూత్రకోశ వ్యాధులు, క్యాన్సర్, కంటి పరీక్షలు చేసి మందులు అందజేస్తారని తెలిపారు.

నేడు లోక్ కల్యాణ్ మేళా

పుంగనూరు: స్థానిక మున్సిపాలిటీలో శనివారం ఉదయం 11 గంటలకు లోక్ కల్యాణ్ మేళా నిర్వహిస్తున్నట్లు కమిషనర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. అర్హులైన 250 మంది వీధి వ్యాపారులకు వ్యాపారాలు చేసుకునేందుకు రుణాలు మంజూరు చేయనున్నట్టు తెలిపారు. వీధి వ్యాపారులు తప్పక హాజరుకావాలని కోరారు.

ఆర్చి నిర్మాణానికి భూమి పూజ


ఆర్చి పనులు ప్రారంభిస్తున్న కడా పీడీ

కుప్పం: కుప్పం పట్టణంలోని వంద పడకల ఆస్పత్రి సర్కిల్ వద్ద ఆర్చి నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ చేశారు. కుప్పం మున్సిపాలిటీకి స్వాగతం పలుకుతూ సుమారు రూ.85 లక్షలతో వెల్కమ్ టు స్వర్ణ కుప్పం నినాదంతో ఆర్చిని నిర్మిస్తున్నట్లు కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. కడా పీడీ వికాస్ మర్మత్ పూజలు చేసి పనులు ప్రారంభించారు.

వైఎస్సార్ సీపీ సమావేశానికి విస్తృత ఏర్పాట్లు

సదుం: మండలంలోని ఎర్రాతివారిపల్లెలో శనివారం జరగనున్న వైఎస్సార్ సీపీ పుంగనూరు నియోజకవర్గ సమావేశానికి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు జెడ్పీటీసీ సోమశేఖర్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి తెలిపారు. వారు శుక్రవారం ఏర్పాట్లను పరిశీలించారు. పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణా రెడ్డి, పలు నియోజకవర్గాల సమన్వయ కర్తలు, ముఖ్య నాయకులు హాజరవుతారని చెప్పారు. నియోజకవర్గంలో ఇటీవల ఎంపికైన కమిటీల సభ్యులు తప్పక హాజరుకావాలన్నారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ సోమశేఖర్ రెడ్డి

ముందస్తు పరీక్షలతో క్యాన్సర్‌కు చెక్



మాట్లాడుతున్న డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, పెద్దపంజాణి : రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ మురళి

పులిచెర్ల(కల్లూరు): ముందస్తు పరీక్షలతో క్యాన్సర్‌ను నివారించవచ్చని పులిచెర్ల పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కమ్మపల్లెలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించి మహిళలకు పరీక్షలు చేశారు. మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది పురుషోత్తం, శ్రీదేవి, చంద్రయ్య, ప్రమీల, యశోద పాల్గొన్నారు.

మహిళలకు స్వస్త్ నారీ సశక్త్ పరివార్ ఎంతో ఉపయోగం

పుంగనూరు: స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం మహిళలకు ఎంతో ఉపయోగమని పుంగనూరు అర్బన్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పవన్‌కుమార్ తెలిపారు. ఆయన శుక్రవారం సుగాలిమిట్ట గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. మహిళలకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దేవమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

పెద్దపంజాణి: స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కింద నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని పెద్దపంజాణి, రాయలపేట పీహెచ్‌సీల వైద్యాధికారులు మురళి, మాధవి తెలిపారు. వారు శుక్రవారం అమ్మరాజుపల్లి, రాయలపేట గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి మహిళలు, పిల్లలకు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు.


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

కాకాతోపులో ప్రత్యేక వైద్య శిబిరం

పలమనేరు: పట్టణంలోని కాకాతోపు అర్బన్ హెల్త్ సెంటర్‌లో శుక్రవారం స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సురేఖ మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంపై దృష్టి పెట్టాలన్నారు. సీజనల్‌గా దొరికే పండ్లు, ఆకుకూరలను ఎక్కువగా తినాలని సూచించారు. ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ మమతారాణి, మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, డాక్టర్లు యుగంధర్, దేవరాజులు, ఆస్పత్రి సలహా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు పలమనేరులో జాబ్‌మేళా

పలమనేరు: పట్టణంలోని ఎల్‌బీ నగర్‌లోని ఆర్‌సీఆర్ భవనంలో శనివారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు క్వానట్ కంపెనీ నిర్వాహకురాలు తస్లీం తెలిపారు. ఇందులో పలు కంపెనీల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు చేస్తారని తెలిపారు. పదో తరగతి, డిగ్రీ ఆపై చదువుకున్న వారు హాజరుకావచ్చునని పేర్కొన్నారు.

రేపు రాజ్యాంగ పరిరక్షణ యాత్ర

పుంగనూరు: మాలమహానాడు ఆధ్వర్యంలో ఆదివారం రాజ్యాంగ పరిరక్షణ యాత్ర చేపట్టనున్నట్టు ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్ఆర్. అశోక్ తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం రాజ్యాంగం ప్రమాదంలో పడిందన్నారు. కొంతమంది పాలకులు తమకు ఇష్టం వచ్చినట్టు రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్రలు చేస్తున్నారని తెలిపారు. ఈ క్రమంలో రాజ్యాంగ పరిరక్షణ యాత్రను పుంగనూరు నుంచి మదనపల్లె వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మేధావులు, విద్యార్థులు, మాలమహానాడు నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

పుంగనూరు: త్రైత సిద్ధాంత భగవద్గీతను ప్రతి ఒక్కరూ చదవాలని త్రైత సిద్ధాంత ప్రభోద సేవా సమితి అధ్యక్షుడు పెంచలయ్య తెలిపారు. ఆయన శుక్రవారం లక్కుంట, భీమగానిపల్లె, బడిగిరెడ్డిపల్లె, కుదవూరు తదితర గ్రామాల్లో భగవద్గీత పుస్తకాలు పంపిణీ చేశారు. భగవద్గీత పఠనంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు మధు, గాయత్రి, నర్సారెడ్డి, భాగ్యమ్మ, కల్పన, పెంచలస్వామి, కిరణ్, వెంకటేశ్వర్లు, సుబ్బమ్మ, రేణుకాదేవి పాల్గొన్నారు.

బాలకృష్ణ వ్యాఖ్యలపై ఆగ్రహం


బాలకృష్ణ వ్యాఖ్యలపై పలమనేరులో నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- పలమనేరులో అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం
- బాలకృష్ణపై చర్యలు తీసుకోవాలని నిరసనలు

పలమనేరు: హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ అసెంబ్లీలో సినీ నటుడు చిరంజీవిపై అనుచిత వ్యాఖ్యలు చేయడంపై వైఎస్సార్ సీపీ శ్రేణులు భగ్గుమన్నాయి. శుక్రవారం ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ నుంచి ర్యాలీ చేశారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నిరసన తెలిపారు. వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ హేమంత్‌కుమార్‌రెడ్డి, నాయకులు చెంగారెడ్డి, ప్రహ్లాద, ముజ్జు మాట్లాడుతూ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో హుందాగా వ్యవహరించాలన్నారు. బాలకృష్ణ వాడు, వీడు అని అనుచితంగా వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. సీఎం చంద్రబాబు, స్పీకర్ అయ్యన్నపాత్రులు సైతం అభ్యంతరం చెప్పకపోవడం సిగ్గుచేటన్నారు. తరచూ చిరంజీవిని అవమానించడం, కాపు సామాజిక వర్గాన్ని తక్కువ చేసి మాట్లాడడం బాలకృష్ణకు అలవాటుగా మారిందని దుయ్యబట్టారు. తన అన్న చిరంజీవికి ఇంత అవమానం జరుగుతున్నా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పందించకపోవడం దారుణమన్నారు. నిరసనలో మున్సిపల్ వైస్ చైర్మన్ రవి, నాయకులు రహీంఖాన్, శ్యామ్, నాగరాజు, కమాల్, సుబ్రమణ్యం నాయుడు, జమీలా, కిశోర్, జావీద్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానం

రొంపిచెర్ల: తల్లి పాలు బిడ్డకు అమృతంతో సమానమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిరీష తెలిపారు. ముత్యాలమ్మ గుడివీధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా తల్లిపాల ఆవశ్యకతపై బాలింతలకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు తాగించాలని, 6 నెలల వరకు తల్లిపాలు తప్పక పట్టాలన్నారు. గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పోష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు హసీనా, సంపత్ కుమారి, అలివేలు, జయమ్మ, రమణమ్మ, లావణ్య, సుస్మిత, తహసీరా తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ శిరీష

కరుణించు మాతా కల్పవల్లి

పలమనేరు, పుంగనూరు, కుప్పం నియోజకవర్గాల్లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా జరుపుకుంటున్నారు. ఇందులో భాగంగా అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేస్తున్నారు. శుక్రవారం అమ్మవార్లు వివిధ అవతారాల్లో భక్తులను అనుగ్రహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించారు. కరుణించు మాతా కల్పవల్లి అని ప్రార్థించారు. ఆలయ నిర్వాహకులు, ధర్మకర్తలు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అన్నదానం చేశారు.

–సాక్షి నెట్‌వర్క్






పెద్దపంజాణి: మహాలక్ష్మిగా కాళికా దేవి, వి.కోట: ప్రత్యేక అలంకరణలో దుర్గాదేవి, గంగవరం: మహాలక్ష్మిగా మలాలమ్మ, రొంపిచెర్ల: పార్వతిదేవిగా ముత్యాలమ్మ, సదుం: ధనలక్ష్మి అలంకారంలో చౌడేశ్వరీదేవి

సదుం: మండలంలోని జాండ్రపేట రామలింగ చౌడేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారు ధనలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. సదుంలోని సదుమమ్మ ఆలయంలో అమ్మవారు నారాయణి అలంకరణలో గరుడ వాహనంపై భక్తులను అనుగ్రహించారు. రాజులు, ఆచారి వంశస్తులు ఉభయదారులుగా వ్యవహరించారు.

మహాలక్ష్మిగా అమ్మవార్లు

వి.కోట: పట్టణంలో వెలసిన కన్యకాపరమేశ్వరి, దుర్గాదేవి అమ్మవార్లు శుక్రవారం మహాలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం ఊంజల్ సేవను ఘనంగా నిర్వహించారు.

గంగవరంలో..

గంగవరం: మండలంలోని మేలుమాయి క్రాస్ వద్ద వెలసిన మలాలమ్మ (చాముండేశ్వరిదేవి) అమ్మవారు శ్రీమహాలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్త చంద్రప్ప ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

అమ్మవార్లకు ప్రత్యేక అలంకారం

పుంగనూరు: పట్టణంలోని భోగ నంజుడేశ్వర స్వామి ఆలయంలో పార్వతిదేవిని మహాలక్ష్మి అలంకారంలో తీర్చిదిద్దారు. బస్టాండ్‌లోని విరూపాక్షి మారెమ్మను వెన్నతో అలంకరించారు. కన్యకా పరమేశ్వరిని పట్టువస్త్రాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. చదళ్లలో చౌడేశ్వరిదేవి మహాలక్ష్మిగా భక్తులను అనుగ్రహించారు.

శ్రీమహాలక్ష్మిగా కాళికాదేవి

పెద్దపంజాణి: మండలంలోని శివాడి గ్రామంలో వెలసిన కాళికాదేవి శుక్రవారం శ్రీమహాలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం రామసముద్రానికి చెందిన వాణి, లేట్ సుబ్రమణ్యాచారి కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. సుకన్య, అరవింద్‌కు వివాహం జరిపించారు. సాయంత్రం పవిత్ర, సురేష్ కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు.

మోహినీ అవతారంలో కన్యకా పరమేశ్వరి



పులిచెర్ల(కల్లూరు): కల్లూరులోని కన్యకా పరమేశ్వరి అమ్మవారు శుక్రవారం మోహినీ అవతారంలో దర్శనమిచ్చారు. బీఆర్ సత్యనారాయణ శెట్టి ఉభయదారులుగా వ్యవహరించారు.


పార్వతిదేవి అలంకరణలో ముత్యాలమ్మ

రొంపిచెర్ల: రొంపిచెర్లలో వెలసిన ముత్యాలమ్మను శుక్రవారం పార్వతిదేవిగా అలంకరించారు. అనంతరం అభిషేకం, శాంతి, పుణ్యాహవచనం, కుంకుమార్చన చేశారు. భక్తులకు దర్శనం కల్పించారు. ఉభయదారులుగా వెంకటేష్ శెట్టి, హిమబిందు వ్యవహరించారు.

వైభవంగా శ్రీచక్రం పూజలు

బైరెడ్డిపల్లె: దసరా బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో మహిళలు శ్రీచక్రం పూజలను ఘనంగా చేపట్టారు. ఉదయం అమ్మవారిని విశేషంగా అలంకరించారు. అలాగే తీర్థం శ్రీరాముడి ఆలయం, బాటగంగమ్మ ఆలయంలో విశేష పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.




పుంగనూరు: మహాలక్ష్మిగా పార్వతిదేవి, వెన్న అలంకరణలో విరూపాక్షి మారెమ్మ, విశేషాలంకరణలో వాసవీ మాత, పులిచెర్ల: కల్లూరులో మోహినీగా కన్యకాపరమేశ్వరి, బైరెడ్డిపల్లె: విశేషాలంకరణలో బాటగంగమ్మ, శ్రీచక్రం పూజల్లో మహిళలు

పెండింగ్ బిల్లులు చెల్లించండి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ యువరాజ్

వి.కోట: పంచాయతీల్లో సర్పంచులు సొంత నిధులు ఖర్చు చేసిన అభివృద్ధి పనులు చేశారని, వాటికి వెంటనే బిల్లులు చెల్లించాలని ఎంపీపీ యువరాజ్ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఆయన శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీ నిధులను సద్వినియోగం చేసుకుని పెండింగ్ చెల్లించాలన్నారు. లేనిపక్షంలో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాల్సి వస్తుందని హెచ్చరించారు. చింతమాకులపల్లి పంచాయతీ పసలమందలో మూడు రోజుల క్రితం బోరు వేశారు. శుక్రవారం మోటారు బిగించి గ్రామస్తులతో కలిసి ఎంపీపీ పూజలు చేసి నీటి సరఫరాను ప్రారంభించారు.